‘సరుకులు కావాలి... మార్కెట్‌కి ఎప్పుడు వెళ్తారు’ గోపాలం భార్య పదోసారి అడిగింది. గోపాలం మాత్రం మూడు రోజుల నుంచీ ‘ఇదిగో తెస్తా, అదిగో వెళ్తా’ అంటూ మాట దాటేస్తున్నాడు. ఇంట్లో ఒక్కొక్కటిగా అయిపోతున్న కందిపప్పు, చక్కెర కోసం గోపాలం కొడుకు గ్లాసు పట్టుకుని పక్కింటికీ ఎదురింటికీ తిరుగుతున్నాడు. ఇలాంటి సందర్భాలన్నీ ఇప్పుడు కథల్లో చదువుకోవాల్సిందే! ఇప్పటి పరిస్థితులు వేరు. ఇంట్లో ఏం నిండుకున్నా సరే... పది నిమిషాల్లోనే వాటిని అందించే సేవలు అందుబాటులోకి వచ్చేశాయి. అవి కూడా అత్యుత్తమ నాణ్యతతో, తక్కువ ధరలో! క్విక్ కామర్స్ పేరుతో విస్తరిస్తున్న ఈ సేవలు ఓ దశాబ్ద కాలం నుంచే అందుబాటులోకి వచ్చాయి. కానీ, వాటిని ప్రజలు అంతగా ఆదరించలేదు.

కవర్ స్టోరీ



# క్విక్ కామర్స్.. మేలా? కీడా?

నిరంతరం గిరాకీ లేకపోతే కానీ గిట్టుబాటు ఉండని ఆ రంగంలో చాలా కంపెనీలు తీవ్ర నష్టాలను చవిచూశాయి. కానీ, కొవిడ్ రాకతో బండ్లు ఓడలయ్యాయి. ఇంటి నుంచి కదల్లేని పరిస్థితిలో అందరూ ఆన్‌లైన్ సేవలను ఉపయోగించుకున్నారు. నట్టింట్లో సినిమాల నుంచి వంటింటి భోజనం వరకూ... ఇంటి బాధ్యతలన్నీ ఆన్‌లైన్ కంపెనీలు తీసుకున్నాయి. అది కాస్తా ఇప్పుడు అలవాటుగా మారింది. కానీ, ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. ఈ క్విక్ కామర్స్ వల్ల మన జీవనశైలి ఎలా మారబోతున్నది. వీటితో అవసరమైన వస్తువులు అందుబాటులోకి రావడం సరే... ఆర్థిక రంగం నుంచి సామాజిక బంధాల వరకూ వీటి ప్రభావం ఎలా ఉండబోతున్నది? వీటి దెబ్బకు కిరాణా షాపులు మూతబడిపోతాయా?

... కె.సహస్ర